
సాక్షి ఒడిశా

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,42,806లు, బంగారం 30 గ్రాముల 220 మిల్లీగ్రాములు వెండి 266 గ్రాముల 650 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



'కట్టల'పాములు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన విజిలెన్స్ దాడుల్లో పలువురు అధికారులు పట్టుబడ్డారు.

- 8లో



అవులను వధిస్తున్న వ్యక్తులు అరెస్టు

ఉమ్మర్‌కోట్ ప్రాంతంలో అవులను వధించి, మాంసం విక్రయిస్తున్న వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

రాష్ట్రానికి భారీ వర్ష సూచన



భువనేశ్వర్‌లో కురుస్తున్న వాన

భువనేశ్వర్: రాష్ట్రంలో భారీగా వర్షాలు కురుస్తాయని ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయం ముందస్తు సమాచారం శనివారం జారీ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లను హెచ్చరించింది. వర్షపాతం కారణంగా శనివారం నుంచి 2వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది. ఆదివారం 3 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 6 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మల్కన్‌గిరి, కొరాపుట్, నవరంగ్‌పూర్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ కాగా, నువాపడా, కలహండి, కంధమల్, రాయగడ, గంజాం, గజపతి జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో తలెత్తే విపత్తు నిర్వహణపై అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఎస్ఆర్‌సీ సూచించింది.

కోబ్రా కలకలం



పట్టుబడిన కోబ్రా

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల విద్యుత్ కేంద్రంలో శుక్రవారం రాత్రి సుమారు 10 అడుగుల కోబ్రా కలకలం సృష్టించింది. నైట్ షిఫ్టులో ఉన్నటువంటి ఉద్యోగులు కోబ్రాను గుర్తించి స్నేక్ క్యాచర్ రాజేంద్ర ఖోరకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వచ్చి చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం దానిని ఘాటీ దిగువ భాగంగా విడిచిపెట్టారు.

అడపా పాహండి ఘటనకు పరిహార పూజలు



వివరాలు వెల్లడిస్తున్న మంత్రి పృథ్వీరాజ్

భువనేశ్వర్: ఈ ఏడాది ముగిసిన రథయాత్రలో చోటు చేసుకున్న అడపా పాహండి ఘటనకు పరిహార పూజలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలియజేశారు. పరిహార పూజా నియమాల గురించి చర్చించడం జరిగిందన్నారు. ముక్తి మండపం పండిత సభ పరిహార పూజా ముహూర్తం, అనుబంధ కార్యక్రమాలు ఖరారు చేస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో బలభద్ర స్వామి మూల విరాటు పడిపోలేదని మంత్రి వివరించారు. ఆకస్మికంగా పట్టు కోల్పోయిన యావత్తు మూల విరాటు సేవాయతుల వీపుపై ఉండిపోయిందన్నారు. బలభద్ర స్వామి దారు విగ్రహం ఏ ఒక్క భాగం కిందకు తాకలేదన్నారు. మూల విరాటుకు ఏమాత్రం భంగం కలగలేదని మంత్రి స్పష్టం చేయడం విశేషం. ఈ మేరకు విచారణ పూర్తయ్యిందని తెలిపారు. అయితే నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని పేర్కొన్నారు.

ప్రత్యేక అలంకరణ




ప్రత్యేక అలంకరణలో మూల విరాట్టులు

భువనేశ్వర్: బాద్రపద కృష్ణ పక్ష త్రయోదశి పురస్కరించుకుని పూరీ శ్రీజగన్నాథ ఆలయంలో కృష్ణ బలరామ్ అలంకరణలో బలభద్రుడు, శ్రీజగన్నాథుడు, యోగమాయ అలంకరణలో దేవీ సుభద్ర భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్న ధూపదీపన అనంతరం శ్రీబలభద్ర స్వామిని బలరాముడి రూపంలోనూ, శ్రీజగన్నాథుడు శ్రీకృష్ణుడి రూపంలో, సుభద్రాదేవిని యోగమాయ రూపంలో అలంకరించారు.

సీఎం అభియోగ శిబిరం తాత్కాలిక బంద్

భువనేశ్వర్: సీఎం మోహన్ చరణ్ మాఝీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రతీ సోమవారం కొనసాగుతున్న ప్రజాభియోగాల విచారణ శిబిరం వరుసగా 3 వారాలు మూత బడుతుంది. ఈనెల 2, 9, 16 తేదీల్లో ముఖ్యమంత్రి ప్రజాభియోగాల విచారణ జరగదని సీఎం కార్యాలయం ప్రకటించింది. అసెంబ్లీ తొలి సమావేశాలు పురస్కరించుకొని ఈనెల 2న, నువాఖాయ్ పండుగ సందర్భంగా 9న మరియు ప్రవక్త మహ్మద్ పుట్టినరోజు (మిలాద్ ఉన్-నబీ) 16న కావడంతో అభియోగాల శిబిరం మూత బడుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

INSIDER'S GUIDE TO GAJAPATI PALACE



ముగ్ధ మనోహరంగా పర్యాటకులను ఆకర్షించే పర్లాకిమిడి గజపతి వంశీయుల రాజప్రాసాదం గజపతి ప్యాలెస్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. రాచరికపు ఠీవితో చారిత్రాత్మక వైభవానికి చిహ్నంగా నిలవాల్సిన కోటలు బీటలు వారుతున్నాయి. లండన్‌లోని బకింగ్ హోమ్ ప్యాలెస్ ఆకారంలో 1843లో యూరోపియన్ శైలిలో నిర్మించిన ప్యాలెస్‌ను పాలకులు పట్టించుకోకపోవడంతో కళా విహీనంగా మారింది. ఆ ప్యాలెస్ వైభవాన్ని పరిచయం చేయడమే ఈ సండే స్పెషల్...

– పర్లాకిమిడి

ప్యాలెస్‌కు కుడివైపు సింహం విగ్రహం

గజపతి వంశీయురాలు కల్యాణీ గజపతి

రాణీవారి అలంకరణ దర్పణం (శాండల్ ఉడ్‌తో)

గజపతి... ఏమిటీ గతి..!

- శిథిలావస్థకు చేరుకున్న గజపతి ప్యాలెస్
- మరమ్మతులు చేయకపోవడంతో కళా విహీనం
- ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవాలని స్థానికుల విన్నపం

సండే స్పెషల్

గతమెంతో ఘనం.. వర్తమానం వ్యర్థం అన్నచందంగా మారింది పర్లాకిమిడి రాజావారి ప్యాలెస్ పరిస్థితి. స్వతంత్ర్య ఉత్కళ రాష్ట్ర ఏర్పాటులో కీలక ఘట్టాలకు వేదికగా నిలిచిన ఈ అపురూప కట్టడం ప్రాముఖ్యత నేడు ఎవరికీ పట్టకుండా పోయింది. పర్లాకిమిడి సంస్థానాన్ని 1851 వరకు మహారాజా జగన్నాథ గజపతి నారాయణ దేవ్, ఆయన మరణానంతరం వారి కుమారుడు ప్రతాప రుద్ర గజపతి 1851 నుంచి 1885 వరకు పాలించారు. తర్వాత వారి కుమారుడు గౌరచంద్ర గజపతి నారాయణ దేవ్ 1885 నుంచి 1904 పాలించారు.

65 ఏళ్ల క్రితం మరమ్మతులు

గౌరచంద్ర గజపతి నారాయణదేవ్ కుమారుడు మహారాజా కృష్ణచంద్ర గజపతి (1913–1974) హయాంలో చివరి సారిగా రాజావారి కోటకు అంతర్భాగం అలంకరణ, మరమ్మతులు జరిగినట్లు రికార్డుల్లో ఉంది. రాజావారి ఏనుగుల రాకపోకలకు వీలుగా 22 అడుగుల సింహద్వారానికి రాజ ముద్రికతో పాటు బ్రిటీష్ పాలకుల ధర్మసూత్రంగా 'స్ట్రాంగ్ అండ్ ఫెయిత్ ఫుల్' అనే పదాలతో పెద్ద ఇనుప గేటు ఏర్పాటు చేశారు. సింహద్వారానికి ముందు కాపాలాగా విశ్రాంతి తీసుకుంటూ వాలి వున్న రెండు సింహాల రాతి విగ్రహాలు కనిపిస్తాయి. ఒక సింహం నిద్రపోతున్నట్లు, మరొకటి మెలకువగా ఉన్నట్లు తీక్షణంగా పరిశీలిస్తే కనిపిస్తుంది.

ప్రత్యేక రోజుల్లోనే అనుమతి

అప్పట్లో పర్లాకిమిడి రాజావారు కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్ మద్రాసు నుంచి పర్లాకిమిడికి వచ్చేటప్పుడు మాత్రమే రాజావారి కోట గేట్లు తెరిచేవారు. ఆయన తదనంతరం గోపినాథ గజపతి నారాయణ దేవ్ హయాంలో రథయాత్రకు, దసరా ఉత్సవాల్లో శ్రీమాణికేశ్వరీ అమ్మవారు పూజలు అందుకున్నప్పుడు, రాజావారి దర్శనార్థం, ప్యాలస్ లోపలికి కొన్ని గంటలు మాత్రమే ప్రజలకు అనుమతి ఇచ్చేవారు. అయితే గోపీనాథ గజపతి నారాయణ దేవ్‌ను రాజస్థాన్ రాజా మాధవ రాజ సింధియా క్రియాశీల రాజకీయాల్లోకి ఆహ్వానించాక ఆయన బరంపురం ఎంపీ స్థానం నుంచి 1989లో లోక్‌సభ సభ్యుడిగా గెలిపొందారు. తర్వాత ఆయన బీజేపీలో చేరి 1998 నుంచి 2009 వరకూ ఉండి, చివరకు బీజేడీలో చేరారు. ఆయన హయాంలో గజపతి ప్యాలస్‌ను చూడటానికి సందర్శకులకు అవకాశం కల్పించారు. గజపతి ప్యాలస్ నిర్మాణం జరిగి ఇప్పటికి 189 వసంతాలు పూర్తి చేసుకుంది. ప్రస్తుతం దర్బార్ హాలు, రాణీ వసతి గదులు, దాసీల వసతి గదులు కూలిపోయి ఉన్నాయి. కోట కుడివైపు రాజవంశీయురాలు కల్యాణీ గజపతి యూటెక్ కంప్యూటర్స్, డీపీఆర్‌వో కార్యాలయం, ప్రైవేటు ఫార్మా కార్యాలయాలకు అద్దెకు ఇచ్చారు. ప్యాలస్ బయట స్థలం ప్రైవేటు వ్యక్తులకు అమ్మకం చేపట్టడంతో కోట మునిపటిలా ఆకర్షణీయంగా లేదు అన్నది సత్యం. ఇప్పటికైనా యువరాణి కల్యాణీ గజపతి దేవ్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్యాలస్ అప్పగించి, మ్యూజియంగా మారిస్తే మంచిదని పలువురు సీనియర్ సిటిజన్లు, విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



కోట మేడపైకి వెళ్లడానికి చెక్కమెట్లు


ఇదీ చరిత్ర

- ప్రతాప రుద్ర గజపతి నారాయణ దేవ్ (1771–1802) తన రాజ్యానికి పర్లాఖెముండిని రాజధానిగా ఏర్పాటు చేసుకున్నారు.
- వీరి మనుమడు జగన్నాథ గజపతి నారాయణ దేవ్ (1821–1851) సుందరమైన కోటను నిర్మించడానికి తలపెట్టారు.
- దీనికోసం అప్పటి బ్రిటీష్ ప్రభుత్వానికి రూ.24.20 లక్షలు గ్రాంటుగా అందజేశారు.
- రూ.4.50 లక్షలు బయానాగా ఇచ్చి, బ్రిటీష్ ఇంజినీర్ రాబర్ట్ ఫెల్లాస్ చెస్లామ్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు.
- భవనం పనులు 1835లో ప్రారంభమై రెండు అంతస్తులు, 80 గదులతో 1843 నాటికి కళ్లు చెదిరే రీతిలో రూ.85 లక్షలతో పూర్తి చేశారు.
- ఈ కోట యూరోపియన్ మిశ్రమ వాస్తుకళతో బకింగ్ హామ్ ప్యాలెస్ నిర్మాణాన్ని పోలి ఉంటుంది.
- దర్బారు హాల్ వెనుక కల్యాణ మండపం, పడక గదులు, వంట, స్నానపు గదులు, దాసీలు, పరిచారికులకు ప్రత్యేకంగా మూడు వరుసల్లో గదులు ఉంటాయి.
- వినోదం కోసం కోట లోపల ఎడమ వైపు టెన్నిస్ కోర్టు, బిలియర్డ్స్ గదులు ఉన్నాయి.
- కోటను ఆనుకుని ఉన్న డాబాగుడిలో సుమారు 8 ఎకరాల్లో క్రికెట్ మైదానం, ఏనుగులు, గుర్రాలు, ఆవుల శాలలతో పాటు వివిధ రకాల విలాసవంతమైన కార్లు పార్కింగ్‌కు స్థలం ఉన్నది.


అందరికీ సమయం తెలిసేలా...

సింహద్వారం వద్ద ప్రతీ గంటకు ఊరంతటికీ సమయం వినిపించేలా వీలుగా పెద్దగంట, కర్ర సమ్మెట అమర్చారు. అక్కడ నేటికీ ఒక కాపాలాదారు గంట గంటకు కొడుతూనే ఉంటాడు. పూర్వకాలంలో ఈ గంటలు కొడితే గానీ సమయం ఎంతైంది అనేది ప్రజలకు తెలిసేదికాదు.






కోట లోపలి భాగంలో కల్యాణ మండపం



కుప్పకూలిన ప్యాలెస్ ముందరి భాగం



కోట ఎంట్రన్స్



శిథిలావస్థకు చేరిన ప్యాలెస్‌లోని భాగం

సరికొత్త హంగులతో...!

- పట్టాలెక్కనున్న వందే భారత్ స్లీపర్ రైళ్లు

భువనేశ్వర్: భారతీయ రైల్వే ప్రయాణికులకు అధునాతన ఉన్నత సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యమిస్తోంది. దీనిలో భాగంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణం మరింత విలాసవంతం కానుంది. ఛైర్ కారుతో పట్టాలెక్కిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు విశేష ప్రయాణికుల ఆదరణ నోచుకోవడంతో రైల్వేశాఖ మరో ముందడుగు వేసింది. ఈ నేపథ్యంలో భారత్ స్లీపర్ రైళ్లు నడిపించనుంది. ఈ ఏడాది డిసెంబర్‌లో వందే భారత్ స్లీపర్ రైలును పట్టాలు ఎక్కించి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేసింది. మొదటి సెట్‌ను బెంగళూరులోని బీఈఎంఎల్ నుంచి సెప్టెంబర్ 20న విడుదల చేయనున్నారు. వందే భారత్ స్లీపర్ రైళ్లలో 823 బెర్తులతో 16 కోచ్‌లు ఉంటాయి. 611 బెర్తులతో కూడిన 11 తృతీయ శ్రేణి ఎయిర్ కండిషన్ కోచ్‌లు, 188 బెర్తులతో 4 ద్వితీయ శ్రేణి ఎయిర్ కండిషన్ కోచ్‌లు, 24 బెర్తులతో 1 ప్రథమ శ్రేణి ఎయిర్ కండిషన్ కోచ్‌లు ఉంటాయి. ముఖాముఖి ఢీకొనే విపత్కర పరిస్థితుల్లో ప్రాణహాని వంటి ప్రమాదం నివారణకు కవచ్ వంటి అధునాతన భద్రతా వ్యవస్థతో మెరుగైన చర్యలు ఉంటాయి.



ప్రథమ శ్రేణి ఏసీ కోచ్



ద్వితీయ శ్రేణి ఏసీ కోచ్

ఎమ్మెల్యే నర్సింగ బోత్రకు అస్వస్థత



ఆస్పత్రిలో ఎమ్మెల్యే నర్సింగ బోత్ర

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా జోరిగాం ఎమ్మెల్యే నర్సింగ్ బోత్ర అస్వస్థతతో ఆస్పత్రిలో చేరారు. శనివారం రాష్ట్ర రాజధానిలో అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాల్సిన సమయంలో కడుపు నొప్పి వచ్చింది. దీంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పరీక్షించిన వైద్యులు ఉండుకం సమస్యగా గుర్తించారు. వెంటనే ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేసి ఉండుకం తొలగించారు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఆరోగ్యం కుదుట పడిందని వైద్యులు ప్రకటించారు.

మునిగిన వంతెనలు



కంగుర్‌కొండ వంతెన వద్ద ప్రవహిస్తున్న వరద నీరు

మల్కన్‌గిరి: జిల్లాలో భారీగా వర్షం కురుస్తోంది. కలిమెల సమితి కంగుర్‌కొండ వద్దనున్న వంతెనపై 3 అడుగులు వరద నీరు ప్రవహించడంతో వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. దీంతో మల్కన్‌గిరి నుంచి మోటు వరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే పోట్టేరు, ఎంవీ 90 గ్రామాలు వద్ద వంతెనలపై సైతం నీరు ప్రవహిస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



వంతెనపై నీటిలోనే ప్రయాణాలు సాగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

'అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు'



ఆటోలో తరలిస్తున్న బంగాళ దుంపల బిల్లులు తనిఖీ చేస్తున్న దృశ్యం

రాయగడ: బంగాళ దుంపలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు పౌర సరఫరాల శాఖ అధికారి సుధాంశు భొయ్ హెచ్చరించారు. ఈ మేరకు కృత్రిమ కొరత ఆరోపణల నేపథ్యంలో హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు, బంగాళ దుంపల గోదాములపై శనివారం దాడులు చేపట్టారు. కిలో బంగాళ దుంపలు రూ.27.50 ఉండగా, తప్పుడు బిల్లులను చూపించి రూ.40 నుంచి రూ.45 వరకు విక్రయిస్తున్నట్లు వచ్చిన ఆరోపణలపై పలువురి వ్యాపారులను నిలదీశారు. కిలో రూ.30 లకు మాత్రమే విక్రయించాలని స్పష్టం చేశారు. దుకాణాల్లో తప్పనిసరిగా ధరల పట్టిక ఉండాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే తమకు వినియోగదారులు సమాచారం అందించాలని కోరారు.

బ్యారక్‌లో మృతదేహం గుర్తింపు

భువనేశ్వర్: కటక్ ఓఎంపీ స్క్వేర్‌లోని 6వ బెటాలియన్ బ్యారక్‌లో హవల్దార్ మృతదేహం వేలాడుతున్నట్లు గుర్తించారు. పరిసరాలను పరిశీలిస్తే ఆయన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. మృతుడు త్రిలోచన సెఠిగా గుర్తించారు. చౌలియాగంజ్ ఠాణా పోలీసులు అసహజ మరణంగా పరిగణించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

బర్డ్ ఫ్లూపై అప్రమత్తం

భువనేశ్వర్: నగర శివారులో బర్డ్ ఫ్లూ వ్యాపించడంతో రాజధాని వాసులను స్థానిక నగర పాలక సంస్థ(బీఎంసీ) హెచ్చరించింది. వ్యాధి విస్తరించిన ప్రాంతాల నుంచి కోళ్లను తీసుకురావద్దని రాజధానిలోని పౌల్ట్రీ వ్యాపారులకు నోటీసులు జారీ చేసింది. అలాగే కోళ్లు అసహజంగా చనిపోతే వాటిని పాతిపెట్టి బ్లీచింగ్ పౌడర్ వేయాలని బీఎంసీ కోరింది. కోడి మాంసం తిన్న తర్వాత ఒక వ్యక్తి లేదా పిల్లలకి జ్వరం, తుమ్ము, దగ్గు ఉంటే తక్షణమే వైద్యుడిని సంప్రదించాలని సూచించింది. దీంతో పాటు భువనేశ్వర్ శివారు ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ విస్తరిస్తున్న నేపథ్యంలో కొద్ది రోజులు తాత్కాలికంగా కోడి మాంసం తినవద్దని నగర మేయర్ సులోచన దాస్ రాజధాని వాసులకు అభ్యర్థించారు. నగరం పరిసర ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి చెందిందని ఆమె అన్నారు. బయటి నుంచి కోళ్లను తీసుకురావద్దని కోళ్ల వ్యాపారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. పూరీ జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బర్డ్ ఫ్లూ కారణంగా ఇప్పటికే 30 వేలకు పైగా కోళ్లు చనిపోయాయి. వచ్చే 6 నెలల పాటు కోళ్ల పెంపకాన్ని నిలిపివేయాలని పశుసంవర్ధక శాఖ సూచించింది. దీంతో కోళ్ళ ఫామ్ యాజమాన్య వర్గం ఆందోళన చెందుతోంది.

రోగ నిర్ధారణ పరీక్షలు చేయండి



సంబరులెండిలో వివరాలు సేకరిస్తున్న వైద్య బృందం

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి కర్లాఘాటి పంచాయతీ సంబరులెండి గ్రామంలో రక్తహీనత కారణంగా మరణాలు సంభవించాయే తప్పా, కిడ్నీ వ్యాధులతో మరణాలు సంభవించలేదని కొట్టిపారేసిన వైద్యశాఖపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఎటువంటి రోగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా కేవలం రక్తహీనతే కారణమని చెప్పి, చేతులు దులుపుకోవడం ఏమాత్ర సమంజసంగా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో అందరికీ కిడ్నీరోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏదో మొక్కుబడిగా వచ్చి చూసి వెళ్లిన వైద్య బృందం, గ్రామంలో పరీక్షలు చేయకుండా అధికారులకు నివేదిక ఇవ్వడం సరికాదన్నారు.

'పుట్ట గొడుగులను తనిఖీ చేస్తాం'

భువనేశ్వర్: శాసన సభలో సభ్యులు పుట్ట గొడుగులు సమస్య శనివారం లేవనెత్తారు. పలుచోట్ల నాసి రకపు పుట్ట గొడుగులు విక్రయిస్తున్నారు. దీంతో అవాంఛనీయ అనారోగ్య పరిస్థితులు తలెత్తుతున్నాయని అధికార, విపక్ష సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల ఆరోపణతో వీటి నమూనాలను సేకరించి తనిఖీ చేస్తామని ఉప ముఖ్యమంత్రి మరియు మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రభాతి పరిడా తెలిపారు. ఈ విషయంలో స్పీకర్ సురమా పాఢి రూలింగ్ ఇచ్చిన తర్వాత ప్రభాతి పరిడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పుట్ట గొడుగులు నాణ్యతపై బీజేపీ, బీజేడీ, కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రశ్న లేవనెత్తారు.

మైనర్ బాలిక మృత్యువాత

పర్లాకిమిడి: స్థానిక కామాక్షినగర్‌లోని ప్రభుత్వ మెడికల్‌లో మైనర్ బాలిక మృత్యువాత పడింది. వివరాల్లోకి వెళ్తే.. కామాక్షినగర్‌కు చెందిన మైనర్ బాలిక ఆరోగ్యం క్షీణించడంతో వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. అయితే ఆమెను డాక్టర్లు పరీక్షలు చేయకుండానే బరంపురం మెడికల్‌కు రిఫర్ చేయడంతో బాధితులు ఆందోళన చెందారు. ఇంతలో ఆమె ఆరోగ్యం క్షీణించి అంబులెన్సులో తీసుకెళ్లాలని ప్రయత్నించినా అప్పటికే మృతి చెందింది. దీంతో మృతురాలి బంధువులు మెడికల్ వద్ద ఆందోళన చేశారు. ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ ప్రశాంత భూపతి విచ్చేసి ఆందోళనకారులను సర్దిచెప్పడంతో శాంతించారు. పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రిలో సాయంత్రం డాక్టర్లు అందుబాటులో ఉండడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

'కట్టల'పాములు

- విజిలెన్స్ దాడుల్లో పట్టుబడిన పలువురు అధికారులు



సోదాల నిర్వహణలో విజిలెన్స్ అధికారులు



భువనేశ్వర్/కొరాపుట్: గంజాం జిల్లా ఛత్రపురంలోని మండల విద్యాధికారి (బీఈఓ) సీతారామ్ పాత్రో ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై ఒడిశా విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. గంజాం జిల్లాలోని 6 చోట్ల ఏకకాలంలో విజిలెన్స్ సోదాలు నిర్వహిస్తోంది. 5 మంది డీఎస్పీలు, 4 మంది ఇన్‌స్పెక్టర్లు, 5 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సహాయక సిబ్బంది ప్రత్యేక న్యాయమూర్తి, విజిలెన్స్, బరంపురం జారీ చేసిన సెర్చ్ వారెంట్ల బలంపై సోదాలు నిర్వహిస్తున్నారు. సోదాల్లో బరంపురంలోని 3,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1 రెండు అంతస్తుల భవనం, 1,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1 రెండు అంతస్తుల భవనం, గంజాంలోని పాలాసార వద్ద మరో భవనం, నగదు రూ.6.50 లక్షలు, 1 ఫోర్ వీలర్ మరియు 2 ద్విచక్ర వాహనాలు మొదలైనవి బయటపడ్డాయి.



సోదాల్లో బయటపడిన నోట్ల కట్టలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి కార్యాలయంలో జేఈగా విధులు నిర్వహిస్తున్న పూర్ణచంద్ర చౌదరి విజిలెన్స్ వలలో చిక్కారు. మనోరేగ పనులకు సంబంధించి స్థానిక రాణిగుడ ఫారంలోని తన నివాసంలో మాఝి అనే వ్యక్తి నుంచి రూ.25 వేల లంచం తీసుకుంటుండగా రాయగడ విజిలెన్స్ అధికారులు శనివారం పట్టుకున్నారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ తారులత బెహర నేతృత్వంలో ఈ దాడి జరిగింది.

భువనేశ్వర్: బరిపద టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర సొరేన్ రూ.6,000 లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు శనివారం పట్టుబడ్డాడు. విజిలెన్స్ వర్గాల సమాచారం ప్రకారం టౌన్ పోలీస్ ఠాణాలో నమోదైన కేసులో తనకు సహాయం చేయడానికి రామ చంద్ర సొరేన్ ఫిర్యాదుదారు నుంచి లంచం కోరాడు. అతడి నుంచి మొత్తం లంచం సొమ్మును విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందిత ఏఎస్ఐ ఆస్తుల ఆర్జన ఆరా తీసేందుకు రెండు ప్రదేశాలలో ఏకకాలంలో సోదాలు చేపట్టారు.

ఆవులను వధిస్తున్న వ్యక్తులు అరెస్టు



అరెస్టైన నిందితులు



ఘటనా స్థలంలో ఆవుల కళేభరాలు

కొరాపుట్: ఉమ్మర్‌కోట్ ప్రాంతంలో ఆవులను వధించి, మాంసం విక్రయిసున్న వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మర్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధి తొహరా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కొండ మీద ఈ ఘటన చోటు చేసుకుంది. గత కొద్ది రోజులుగా ఈ ప్రదేశంలో ఆవులను చంపి వాటి మాంసాన్ని వివిధ ప్రాంతాలకు విక్రయిస్తున్నారని ప్రచారాలు జరుగుతున్నాయి. దీంతో ఆ ప్రాంత గిరిజనులు నిఘా వేశారు. సుమారు 20 మంది యువకులు 3 ఆవులను అడవుల్లోకి పట్టుకెళ్లడం గమనించారు. దీంతో ఆయా ప్రాంతాల గిరిజనులంతా మూకుమ్మడిగా కొండ మీదకు వెళ్లారు. అప్పటికే యువకులు మూడు ఆవులు చంపి మాంసం వాటాలు వేస్తున్నారు. గిరిజనులను చూసిన వారు వెంటనే పరారయ్యారు. వారిలో ఐదుగురిని గిరిజనులు పట్టుకున్నారు. వెంటనే ఉమ్మర్‌కోట్ పోలీసులకు సమాచారం ఇవ్వగా పెద్ద ఎత్తున పోలీసులు అక్కడికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు. వారు వినియోగించిన 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో డెప్పిగుడ గ్రామానికి చెందిన అర్జున్ శాంత, ధన్సారి శాంత, గిర్సన్ శాంత, డొంగ్రిగుడకి చెందిన జయ శాంత, కంకానికి చెందిన బ్రజ శాంతలు ఉన్నారు. ఉమ్మర్‌కోట్ ఐఐసీ డొంబుదర్ ప్రధాన్ కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుభద్ర యోజన టోల్ ఫ్రీ నంబర్ విడుదల

భువనేశ్వర్: సుభద్ర యోజన పథకం విజయవంతమైన అమలు, కార్యాచరణ కోసం మహిళా మరియు శిశు అభివద్ధి శాఖ టోల్ ఫ్రీ నంబర్ 14678 ను విడుదల చేసింది. ఈ నంబర్ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిరవధికంగా పని చేస్తుంది. ఈ సమయంలో ఎవరైనా సుభద్ర యోజనకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందడానికి ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సుభద్ర యోజన పథకాన్ని ప్రారంభించింది. మహిళలకు ఆర్థిక సాయం అందించడం ద్వారా ఆర్థిక సాధికారత మరియు డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం ఈ పథకం యొక్క ప్రధాన లక్ష్యం. 21 నుంచి 60 ఏళ్ల మధ్య దారిద్ర్య రేఖ దిగువనున్న మహిళలు ఈ పథకం లబ్ధిదారులు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1 కోటి మంది మహిళలు లబ్ది పొందుతారని ప్రభుత్వ అంచనా. వీరందరికీ ఏటా 2 విడతల్లో రూ.10 వేలు చొప్పున బ్యాంకు పొదుపు ఖాతాలకు ప్రత్యక్షంగా నగదు బదిలీ చేస్తారు. సుభద్ర యోజన మార్గదర్శకాల ప్రకారం, రాష్ట్ర లేదా కేంద్ర ప్రభుత్వ పథకం కింద నెలవారీ పింఛను, స్కాలర్‌షిప్ ఇతరేతర ఏదైనా ఆర్థిక సహాయం కింద వార్షిక ఆదాయం రూ.18,000 లేదా అంతకంటే ఎక్కువ పొందుతున్న మహిళలు అనర్హులుగా ప్రకటించబడతారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, ఆశా కార్యకర్తలు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు(సీఆర్పీలు), మాస్టర్ బుక్ కీపర్లు (ఎంబీకేలు), ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమితులైన మహిళలు కూడా సుభద్ర యోజన కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈనెల 17వ తేదీన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనలో భాగంగా పూరీ నుంచి సుభద్ర పథకం ప్రారంభిస్తారు.

కొత్త ఎక్సైజ్ విధానం ప్రకటన

భువనేశ్వర్: ఈ ఏడాది సెప్టెంబర్ తర్వాత అమల్లోకి వచ్చేలా కొత్త ఎక్సైజ్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కొత్త విధానంలో అక్రమ మద్యం వ్యాపారాన్ని నివారించడానికి, మద్యం వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కింది నిబంధనలు, షరతులు విధించింది.

కొత్త ఎక్సైజ్ విధానం

- బార్‌లలో నృత్య ప్రదర్శన అనుమతించబడదు. అయితే లైసెన్స్ పొందిన ప్రాంగణంలో సంగీత ప్రదర్శన లేదా ఆర్కెస్ట్రాను నిర్వహించవచ్చు.
- గ్రామీణ ప్రాంతాల్లో కొత్త బార్లు మంజూరు చేయబడవు. కొత్త బార్లను తెరవడానికి నోటిఫైడ్ ఏరియా కౌన్సిల్స్, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ ప్రాంతాలపై ఎటువంటి పరిమితులు లేవు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్త ఐఎంఎఫ్ఎల్ ఆఫ్ షాప్, సీఎల్ షాప్, ఓఎస్ షాప్ తెరవబడవు. కేవలం 3 నక్షత్రాలు మరియు అంతకంటే ఎక్కువ స్థాయి హోటళ్లు మినహా ఇతర వర్గాలు కొత్త లిక్కరు షాపులు తెరిచేందుకు అనుమతించరు. ఈ లెక్కన గ్రామీణ ప్రాంతాల్లో కొత్త మద్యం దుకాణాలు తెరిచేందుకు అవకాశం లేదని స్పష్టమవుతోంది.
- ఇంతకుముందు నవీకరించుకోని 57 ఆన్ షాప్‌లు ఈ ఆర్థిక సంవత్సరంలో నవీకరించేందుకు అనుమతించరు.
- ప్రతి సంవత్సరం పెంచే ఎంజీక్యూ ఫ్యాక్టర్ ఈ సంవత్సరం పెరగదు.
- మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసింది.
- కొత్త అబ్కారీ విధానంలో కొత్త నియామకాలు, సిబ్బందికి శిక్షణ, మరిన్ని వాహనాలు మరియు కొత్త అబ్కారీ ఠాణాల ఏర్పాటు కోసం అక్రమ మద్యం వ్యాపారం మరియు మద్యం స్మగ్లింగ్‌ను అరికట్టడానికి ఏర్పాటు చేస్తారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం



మావోయిస్టులు అమర్చిన టిఫిన్ బాంబులు



గుహలో వెదుకున్న జవాన్లు



స్వాధీనం చేసుకున్న డంప్‌తో జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బెజాంగ్‌వాడ పంచాయతీ సమీప అడవిలో శనివారం ఉదయం 142 బెటాలియాన్ జవాన్లు ఒక మావోయిస్టుల డంప్ స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. శుక్రవారం సాయంత్రం బోడిగేట బీఎస్ఎఫ్ క్యాంప్ 142వ బెటాలియన్ జవాన్లు కూంబింగ్‌కు వెళ్లారు. అనంతరం శనివారం తెల్లవారు జామున వారు తిరిగి వస్తున్న సమయంలో తేల్‌రాయి పంచాయతీ సమీపంలో ఒక డంప్‌ను గుర్తించారు. దీనిలో రెండు 3 కిలోల బరువు ఉన్న టిఫిన్ బాంబ్‌లు, 62 జిలిటెన్ స్టిక్స్, 12 వోల్టుల 2 బ్యాటరీలు, 39 టోపీలు, బ్యానర్లు, పోస్టర్లు ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

బస్టాండ్‌లో మహిళ మృతదేహం

భువనేశ్వర్: స్థానిక బరముండా పాత బస్టాండ్‌లో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతదేహం గుర్తించారు. ఆమె భువనేశ్వర్ నుంచి గంజాం వెళ్లాల్సింది. శుక్రవారం సాయంత్రం గంజాం జిల్లా సారొడా ప్రాంతానికి వెళ్లేందుకు మరో వ్యక్తితో కలిసి టికెట్లు కొనుగోలు చేసింది. ఆ వ్యక్తితో వాగ్వివాదం చోటు చేసుకున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ప్రస్తుతం ఆ వ్యక్తి జాడ లేనట్లు పోలీసులు తెలిపారు. అనుమానస్పద నిందితుని గుర్తించే దిశలో దర్యాప్తు చేప్టినట్లు స్థానిక భరత్‌పూర్ ఠాణా పోలీసులు తెలిపారు.

ఇండియా సంపన్నుల జాబితాలో రాష్ట్ర వ్యాపారవేత్త



భువనేశ్వర్: హరున్ ఇండియా 2024 సంపన్నుల జాబితాలో రాష్ట్ర వ్యాపారవేత్త తారా రంజన్ పట్నాయక్ స్థానం దక్కించుకున్నారు. ఆస్తుల నికర విలువ రూ.4,900 కోట్లతో ఫాల్కన్ మెరైన్ ఎక్స్‌పోర్ట్సు ప్రమోటర్లు అయిన తారా రంజన్ పట్నాయక్, అతని కుటుంబం భారతీయ సంపన్నుల జాబితాలో 540 ర్యాంక్‌లో ఉన్నారు. తారా రంజన్ పట్నాయక్ 1978లో ఆక్వాకల్చర్ వ్యాపార రంగంలోకి అడుగిడారు. అతను భువనేశ్వర్‌లో ఫాల్కన్ మెరైన్ ఎక్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్థాపించాడు. ఆ తర్వాత 1993లో భువనేశ్వర్‌లోని మంచేశ్వర్‌లో మొదటి ప్రాసెసింగ్ యూనిట్‌ను, 1994లో పారాదీప్‌లో రెండో ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు.

పొలంలో యువకుల మృతదేహాలు

భువనేశ్వర్: పూరీ జిల్లా బ్రహ్మగిరి పోలీస్ ఠాణా పరిధిలోని బలిహార్‌చండి కొతుఅరెడి రోడ్డు సమీపంలోని వరి పొలాల్లో రెండు మృతదేహాన్ని గుర్తించారు. మృతులు పూరీ ఖొడిపాదా ప్రాంతీయులుగా భావిస్తున్నారు. ఘటనా స్థలంలో బైక్ పడి ఉంది. శనివారం ఉదయం కొతుఅరెడి రోడ్డు సమీపంలోని వరి పొలంలో పడి ఉన్న యువకుల మృత దేహాలను స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాల్ని స్వాధీనం చేసుకుని ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. యువకుల మరణం ఎలా సంభవించిందో తెలియరాలేదు. శుక్రవారం రాత్రి బొడొ హర్‌చండీలో విందుకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదంలో యువకులు మరణించినట్లు అనుమానిస్తున్నారు. యువకుల మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

మహాలక్ష్మీ అష్టకం పోటీలు

కొరాపుట్: బ్రహ్మపురలో మహాలక్ష్మీ అష్టకం పోటీలు శనివారం జరిగాయి. నగరంలోని గిరి మార్కెట్ ప్రాంతంలో ఆంధ్ర మహిళా సమాజం కార్యాలయంలో నిర్వహించారు. సుమారు 20 మంది అష్టకం వినిపించారు.

ఆస్పత్రి నిండినది...!







రాయగడ జిల్లాలోని కాసీపూర్ సమితిలో మలేరియా విజృంభిస్తోంది. సీజనల్ వ్యాధుల బారిన పడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో విపరీతంగా రోగులు చేరుతున్నారు. దీంతో ఆస్పత్రిలో బెడ్స్ ఫుల్ అయిపోయాయి. అందువలన కొత్తగా వస్తున్న రోగులకు ఆరుబయటనే చికిత్స అందజేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. గత కొద్ది నెలలుగా ఈ సమితిలో అతిసారం తదితర వ్యాధులు పంజా విసురుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. సమితిలోని సికపాయిలో ప్రస్తుతం మలేరియ విలయతాండవం చేస్తోంది.

– రాయగడ

పెండింగ్‌లో 1.42 లక్షల కేసులు

- న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్



ఒడిశా హైకోర్టు

భువనేశ్వర్: ఒడిశా హైకోర్టులో ప్రస్తుతం 1,42,858 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర శాసన సభలో శనివారం సమాచారం వెల్లడించారు. రాష్ట్ర హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య, పరిష్కరించబడిన కేసుల సంఖ్య, పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌ల కోసం తీసుకున్న చర్యల గురించి బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే సౌవిక్ బిస్వాల్ అడిగిన ప్రశ్నకు న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ సమాధానమిస్తూ ఈ సమాచారం ప్రవేశపెట్టారు. గత 5 ఏళ్లలో హైకోర్టులో 55,203 కేసులు పరిష్కరించగా, పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్య 1,42,858గా ఉందని తెలిపారు. కేసుల సత్వర పరిష్కారానికి, పెండింగ్‌ను తగ్గించేందుకు న్యాయమూర్తుల సంఖ్యను పెంచామని, పెండింగ్‌లో ఉన్న కేసులను హైకోర్టు ప్రాధాన్యత ప్రాతిపదికన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న కోర్టుల్లో 195 జడ్జీల పోస్టులు ఖాళీగా ఉన్నాయని మంత్రి తెలిపారు. విపక్ష బీజేడీ ఎమ్మెల్యే ప్రశాంత్ బెహెరా అడిగిన మరో ప్రశ్నకు మంత్రి స్పందిస్తూ ఆగస్టు 31 నాటికి నాటికి మొత్తం న్యాయమూర్తుల ఖాళీల సంఖ్య 195 అని పేర్కొన్నారు.

పట్టుబడిన ఘనా పౌరులు



ఘనా పౌరులు

భువనేశ్వర్: రష్యా నుంచి వచ్చిన చైనా ఓడలో ముగ్గురు ఘనా పౌరులు ప్రయాణిస్తున్నట్లు పారాదీప్ ఓడరేవు వద్ద గుర్తించడంతో కలకలం రేగింది. పారాదీప్ ఇమిగ్రేషన్ కార్యాలయం నౌక అధికార యంత్రాంగానికి ఈ మేరకు తాఖీదులు జారీ చేసి అప్రమత్తం చేసింది. భారతదేశంలోని ఏ ఓడ రేవులోనూ వీరిని దించకూడదని స్పష్టం చేసింది. ఆ ముగ్గురు వ్యక్తులు ఏ పరిస్థితుల్లో వచ్చారో తెలియరాలేదు. ఈ కోణంలో విచారణ కొనసాగుతోంది.

హైకోర్టు న్యాయమూర్తి పర్యటన

కొరాపుట్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శివ మిశ్ర నబరంగ్‌పూర్‌లో శనివారం పర్యటించారు. దీనిలో భాగంగా జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టుల సముదాయాన్ని సందర్శించారు. కోర్టు ఆవరణలో న్యాయమూర్తులు, న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నబరంగ్‌పూర్ బార్ అసోసియేషన్ సభ్యులతో భేటీ అయ్యారు.



న్యాయమూర్తి శివమిత్రతో బార్ అసోసియేషన్ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పోలీస్‌స్టేషన్ పరిధి శంకరడ సమీపంలో హతపాద వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తి ఆనంద కుమార్ సబర్‌గా గుర్తించారు. టికిరి నుంచి రాయగడ వైపు స్కూటీపై వెళ్తున్న సాబొరాను ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాద స్థలంలో సాబొరా

మంగళ ముదలికి సత్కారం



మంగళ ముదలిని సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొరాపుట్: బొండా గిరిజన జాతి నుంచి తొలిసారి ఎంబీబీఎస్ చదవడానికి ఎంపికైన మంగళ ముదలికి ఒడిశా రాష్ట్ర కాంగ్రెస్ శాసన సభా పక్షం సత్కరించింది. శనివారం రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో శాసన సభ పక్ష నాయకుడు, కొరాపుట్ జిల్లా పొట్టంగి ఎమ్మెల్యే రాం చంద్ర ఖడం సత్కరించారు. గిరిజన జాతి విద్యా కిరణంగా మంగళని ఉద్దేశించి అభినందించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు సోఫియా పిర్దోస్, రాజన్ హిక్క, మంగు కిలో, దాశరథి గమాంగ్, నీల మాదవ హిక్క, పవిత్ర శాంత తదితరులు పాల్గొన్నారు.

మూడుకి పెరిగిన కల్తీసారా మృతులు

భువనేశ్వర్: గంజాం జిల్లా చికిటి నియోజకవర్గం జెనాపూర్ కల్తీ సారా మృతులు సంఖ్య మూడుకి పెరిగింది. ఈ విషాద ఘటనలో శనివారం మరో వ్యక్తి మృతి చెందాడు. మృతుడు చికిటి మండలం జెనాపూర్ సాహికి చెందిన లక్ష్మణ్ బెహరాగా ప్రకటించారు. బరంపురం ఎంకేసీజీ ఐసీయూలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచాడు. లోగడ ఈ ఆస్పత్రిలో కల్తీసారా తాగి చికిత్స పొందుతూ ఇప్పటివరకు 2 మంది మరణించిన విషయం తెలిసిందే. మరో 4 మంది బాధిత వ్యక్తులు ఇప్పటికీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గంజాం జిల్లా చికిటి మండలం మౌండ్‌పూర్ ఠాణా జెనాపూర్, కరాబలువా గ్రామానికి చెందిన 15 మంది వ్యక్తులు కల్తీ నాటుసారా తాగడంతో పరిస్థితి వికటించింది. ఈ ఘటన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం భువనేశ్వర్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అక్రమ మద్యం యూనిట్లపై దాడులు ముమ్మరం చేసింది. బరంపురం అబ్కారీ శాఖ సూపరింటెండెంట్ ప్రదీప్ పాణిగ్రాహిని సస్పెండ్ చేయగా, గంజాంలో నకిలీ మద్యం దుర్ఘటన తర్వాత మరో ఇద్దరు అధికారులను బదిలీ చేశారు.

1992 నుంచి 231 మంది మృత్యువాత

రాష్ట్రంలో కల్తీ మద్యం సేవించి 1992 నుంచి పలుచోట్ల 231 మంది మరణించారని రాష్ట్ర శాసన సభలో శనివారం సమాచారం ప్రవేశపెట్టారు. అబ్కారీ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ సమాచారాన్ని తెలిపారు. అత్యధికంగా 1992లో కటక్‌లో 134 మంది, 2012లో భువనేశ్వర్ శివార్లలోని టుకులిపాడా ప్రాంతంలో 41 మంది మరణించారన్నారు. అదేవిధంగా 2001లో పూరీలో 20 మంది మరణించగా, 2006లో గంజాంలో 19 మంది, 2019లో భద్రక్‌లోని తిహిడి వద్ద నకిలీ మద్యం ఏడుగురి ప్రాణాలను బలిగొందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 433 నాటు సారా తయారీ యూనిట్లు ఉన్నాయి. ప్యాకెటు మద్యం తయారీకి 490 యూనిట్లకు ప్రభుత్వం లైసెన్స్‌లు జారీ చేసిందని మంత్రి వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నాటు సారా విక్రయంతో సమగ్రంగా రూ. 227 కోట్ల ఆదాయం చేకూరింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో 23 కోట్ల లీటర్ల 'మహులి' మద్యం (విప్ప సారా) ఉత్పత్తి అయ్యిందని మంత్రి తెలిపారు.

క్లుప్తంగా

మారిషస్ పైనాపిల్ మొక్కల సరఫరాకు టెండర్లు



సీల్డు టెండర్లు ఓపెన్ చేస్తున్న అధికారులు

సీతంపేట: మారిషస్ పైనాపిల్ మొక్కల సరఫరాకు ఐటీడీఏలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం టెండర్లు ఖరారు చేశారు. ఇన్‌చార్జ్ పీఓ వి.వి.రమణ ఆధ్వర్యంలో టెండర్ ప్రక్రియ నిర్వహించగా 11 మంది టెండర్‌దారులు పాల్గొన్నారు. సీతంపేట, భామిని మండలాల్లో మొత్తం 110 ఎకరాల్లో ఈ పైనాపిల్ మొక్కలను రైతులకు సరఫరా చేయనున్నారు. నాణ్యమైన మొక్కలు సరఫరా చేయాలని ఇన్‌చార్జ్ పీఓ తెలిపారు. కార్యక్రమంలో రస్తాకుంటుంబాయి కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, స్థానిక శాస్త్రవేత్తలు జ్యోతిబసు, లక్ష్మీనారాయణ, పీహెచ్‌వో ఎస్‌వీ గణేష్, హెచ్‌వోలు జయంతి, జయశ్రీ, ఏటీడబ్ల్యూవో మంగవేణి తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో వైభవంగా పూర్ణాహుతి



యాగశాలలో పూర్ణాహుతి జరిపిస్తున్న అర్చక స్వాములు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలోని యాగశాలలో సుందరకాండ పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు శనివారం వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత పుష్యమి నక్షత్రాన్ని పురస్కరించుకొని యాగశాలలో రామాయణ పట్టాభిషేక సర్గ హవనం జరిపించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం వెండి మండపంలోని ఉత్సవమూర్తుల వద్ద స్వామి నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. కార్యక్రమంలో అర్చకులు నరసింహాచార్యులు, సాయిరామాచార్యులు, వరప్రసాద్, రామగోపాల్, భక్తులు పాల్గొన్నారు.

అదనపు ఎస్పీకి ఘన వీడ్కోలు



అదనపు ఎస్పీ అస్మాఫర్వీన్‌ను సన్మానిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖలో పని చేసిన అదనపు ఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్వీన్ సీఐడీ విభాగానికి బదిలీ కావడం, అదే విధంగా ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సోల్మన్, సీసీఎస్ ఎస్ఐ గొల్లు పోలినాయుడు, చీపురుపల్లి ఏఎస్ఐ కోల అడివన్నలకు ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందల్ దుశ్శాలువతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యానివర్స్, డీటీసీ డీఎస్పీ ఎం.వీరకుమార్, ఎస్‌బీ సీఐలు కెకెవి.వి జయనాథ్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ



కోట ప్రాంతంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

విజయనగరం క్రైమ్: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, రోడ్డు ప్రమాదాలలో ప్రాణాపాయం నుంచి రక్షణ పొంది సురక్షితంగా గమ్యస్థానాలు చేరుకోవాలని వాహనదారులకు ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మెసానిక్ టెంపుల్ వద్ద నిర్వహించిన హెల్మెట్ అవగాహన ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఇంటి నుంచి బయటకు వస్తే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నిర్లక్ష్యం కారణంగా కుటుంబాలు వీధిన పడకూడదన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాపాయం నుంచి రక్షణ పొంది, ప్రమాదాల నివారణలో పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎస్పీలు గోవిందరావు, యానివర్స్, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు, వన్‌టౌన్, టూటౌన్, భోగాపురం, మహిళా పీఎస్ సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ స్థాయి జీవన సాఫల్య పురస్కారం అందుకుంటున్న పప్పు భోగారావు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



భువనేశ్వర్: రాష్ట్రస్థాయి వేడుకల్లో సీఎం మోహన్ చరణ్ మాఝి తదితరులు

రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల స్వపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా అన్ని మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. రాజధానిలోని లోక్‌సేవా భవన్‌లో 30 జిల్లాల్లో రూ.1,151 కోట్ల విలువైన 481 అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. మౌలిక సదుపాయాల కోసం ప్రణాళిక, సేవలను అందించడానికి మున్సిపాలిటీల వికేంద్రీకరణ అవసరాన్ని నొక్కి చెప్పారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: గుణుపూర్‌లో దివ్యాంగురాలికి వీల్ చైర్ అందజేస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి తదితరులు



జయపురం: జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మహంతి తదితరులు

గుట్కా విక్రయ దుకాణాలపై దాడులు



దుకాణాల్లో దాడులు చేపడుతున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని చంద్రపూర్‌లో నిషేధిత గుట్కాలు విక్రయించే దుకాణాలపై అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. చంద్రాపూర్‌లో సుమారు 50 దుకాణాల్లో నిర్వహించిన దాడుల్లో గుట్కాలు, బంగ్ వంటి నిషేధిత నిషా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో డాక్టర్ జ్యోతి ప్రకాష్ సారేన్, సమాజ సేవకురాలు సంతోషిణి స్వయి, చంద్రపూర్ పోలీసుస్టేషన్‌ఎస్ఐ అరుణ్ బెహర తదితరులు పాల్గొన్నారు.

6న మిగులు యూజీ సీట్లకు ఓపెన్ కౌన్సెలింగ్

- గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి



ప్రొఫెసర్ టీవీ కట్టిమణి, వీసీ, గిరిజన వర్సిటీ

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 2024–25 విద్యాసంవత్సర ప్రవేశానికి అందిస్తున్న వివిధ అండర్ గ్రాడ్యుయేట్ ప్రొగ్రామ్స్ కోర్సుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 6న ఓపెన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఓపెన్ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందగోరే అభ్యర్థులు ఎన్‌టీఏ నిర్వహించిన సీయూఈటీ (యూజీ) పరీక్ష రాసిన వారై ఉండాలన్నారు. కౌన్సెలింగ్ హాజరయ్యే అభ్యర్థులు 'సీటీయూఏపీ.ఏసీ.ఐఎన్' వెబ్ సైట్‌లో తమ పేర్లను ఈ నెల 5వ తేదీ రాత్రి 11.55 గంటలలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలను యూనివర్సిటీ క్యాంపస్ హెల్ప్‌డెస్క్ లేదా ఫోన్ నంబర్ 089922 96033ను సంప్రదించాలని సూచించారు. నాలుగు సంవత్సరాల నిడివికల రీసెర్చ్‌తో కూడిన బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బోటనీ, బీఎస్సీ జియాలజీ, బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యూజీ కోర్సుల్లో మిగులు సీట్లకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

మృతుడు పెదబంటుపల్లి వాసి

- ఐఎంఈఐ నంబర్ ఆధారంగా అడ్రస్ గుర్తింపు
- తాపీ పని చేస్తూ జీవనం
- పోస్టుమార్టం అనంతరం మృతిపై నిర్ధారణ




అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన మజ్జి లక్షుంనాయుడు

చీపురుపల్లి: అనుమానాస్పద స్థితిలో ఉన్న మృతదేహం ఆచూకీ లభించింది. వారం రోజులుగా ఎవరికీ తెలియకుండా జంతువులు పీక్కు తినే స్థితిలో ఉన్న మృతదేహం ఎవరనేది పోలీసులు కనుగొన్నారు. మండలంలోని రేగిడిపేట పరిసరాల్లో శుక్రవారం లభించిన మృతదేహానికి సంబంధించి గుర్ల మండలంలోని పెదబంటుపల్లి గ్రామానికి చెందిన మజ్జి లక్షుంనాయుడు(35)గా గుర్తించినట్లు ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. మృతుడి ముఖం, కాళ్లు, చేతులు జంతువులు పీక్కు తినడంతో గుర్తు పట్టలేని స్థితిలో మృతదేహం ఉన్న సంగతి తెలిసిందే. అయితే మృతుని ఫ్యాంట్ జేబులో ఉన్న మొబైల్‌లోని ఐఎంఈఐ నంబర్ ఆధారంగా ఆయన అడ్రస్సు సేకరించారు. పెదబంటుపల్లి గ్రామానికి చెందిన లక్షుంనాయుడు తాపీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉండగా భార్య ఐదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో పిల్లలు ఇద్దరూ విజయవాడలోని పెద్దమ్మ ఇంటిలో ఉంటున్నారు. మృతుడు లక్షుంనాయుడు తాపీ పని చేసుకుంటూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవాడు. అందులో భాగంగానే వారం క్రితం వెళ్లిన లక్షుంనాయుడు తిరిగి రాలేదు. లక్షుంనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతి వెనుక కారణాలపై నిర్ధారణకు రావాల్సి ఉంటుందని ఎస్ఐ తెలిపారు. తండ్రి రామప్పడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

భారీ వర్షాలు.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

- కంట్రోల్ రూం ఏర్పాటు
- ఉద్యోగులకు ఆదివారం సెలవు రద్దు
- పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ తీరం దాటేవేళ విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లా అధికారులతో కలెక్టర్ కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్‌లో శనివారం మాట్లాడారు. విపత్తుల వేళ సహాయక చర్యలు అందించేందుకు వీలుగా కలెక్టర్ కార్యాలయం-08963-293046, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. అధికారులు, సిబ్బంది సెలవులు రద్దుచేసినట్టు ప్రకటించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సోమవారం సెలవు దినంగా ప్రకటించారు. ఆశ్రమ పాఠశా లలు, గురుకులాలు పని చేస్తాయని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాజెక్టుల్లో ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలతోపాటు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు బయట తిరగరాదన్నారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. టెలికాన్ఫరెన్స్‌లో ఆర్డీఓలు ఎ.హేమలత, వీవీ రమణ, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, ఇరిగేషన్ ఈఈ ఆర్.అప్పలనాయుడు, జగదీష్, జిల్లా విపత్తుల నిర్వహణాధికారి శ్రీనుబాబు, ఆర్‌అండ్‌బీ అధికారి ఎం.జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

భోగారావుకు గిడుగు పురస్కారం

విజయనగరం టౌన్: తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకుని గిడుగు రామూర్తి ఫౌండేషన్ జాతీయ స్థాయిలో ప్రధానం చేస్తున్న గిడుగు పురస్కారాలలో కళా రంగంలో చేసిన సేవలకు గానూ విజయనగరానికి చెందిన పప్పు భోగారావుకు జాతీయ స్థాయి జీవన సాఫల్య పురస్కారం లభించింది. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటనలోకి విషయం తెలిపారు. విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన భాషా దినోత్సవ వేడుకల్లో ఫౌండేషన్ నిర్వాహకులు, ముఖ్య అతిథుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నామన్నారు. ఈ మేరకు విజయనగరంలో సహజ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు ఎన్‌కె.బాబు, నాలుగెస్సుల రాజు, సాహిత్య అభిమానులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం



అరెస్టైన డ్రైవర్ మహ్మద్

జయపురం: డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న వాహనదారులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం రాత్రి ఒక ట్రక్కును తాగి డ్రైవ్ చేస్తున్న డ్రైవర్‌ని పట్టుకున్నారు. అతడిని అరెస్టు చేసినట్లు శనివారం పట్టణ పోలీసు అధికారి ఈశ్వర చంద్రతండి వెల్లడించారు. అరెస్టైనవ్యక్తి ఝార్ఖండ్ రాష్ట్రం సరైకల్ జిల్లా అనసారేనగర్‌కు చెందిన మహ్మద్ మకసూద్‌గా వెల్లడించారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం

భువనేశ్వర్: అత్యాచారం ఆరోపణల నుంచి కోర్టు తన ప్రియుడిని నిర్దోషిగా ప్రకటించడంతో న్యాయస్థానం ప్రాంగణంలో ప్రియురాలు ఆత్మహత్యాయత్నం చేసింది. పారాసిటమాల్ మాత్రలు మింగి ఈ ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన సుందర్‌గఢ్ జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టు ప్రాంగణంలో చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది కమల్ సేన్ జిల్లా కోర్టుల్లో మెరుగైన భద్రతా చర్యల ఆవశ్యకతను ఎత్తి చూపారు. అత్యాచారానికి పాల్పడిన తన ప్రియుడిని కోర్టు తన అన్ని అభియోగాల నుంచి నిర్దోషిగా ప్రకటించడంతో ఆత్మహత్యాయత్నం చేసింది. విచారణ అనంతరం ఆమె కోర్టు నుంచి బయటకు వచ్చి మాత్రలు వేసుకున్నట్లు సమాచారం.

పాముకాటుతో బాలుడి మృతి



బాలుడి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఉంద్రకొండ పంచాయతీ టేకాల్‌గూడ గ్రామంలో మహేష్ పూనం (3) అనే బాలుడు పాముకాటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాత్రి తన తల్లితో కలిసి ఇంట్లో నిద్రపోతున్న బాలుడు ఒక్కసారిగా అర్ధరాత్రి కేకలు వేశాడు. దీంతో తల్లి లేచి చూడగా ఒక పాము సమీపంలోని కన్నంలోకి వెళ్లడం గమనించారు. వెంటనే తల్లి ఇర్మా భర్తను లేపి విషయాన్ని చెప్పింది. దీంతో వెంటనే బాలుడి తండ్రి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా



గాయపడిన యువకుడు

జయపురం: బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి కాటపాడ గ్రామ పంచాయతీ ముదులిగుడ గ్రామానికి చెందిన 10 మంది ఒక ఆటోలో బొయిపరిగుడ సమితి దసమంతపూర్ పంచాయతీ కాకలపడ గ్రామంలో జరుగుతున్న పెద్ద కర్మకు శుక్రవారం రాత్రి వెళ్లారు. అనంతరం తిరిగి వస్తుండగా నిశాన కూడలి వద్ద ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏడుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఎంపీ సప్తగిరికి జార్ఖండ్ బాధ్యతలు

కొరాపుట్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు కార్యదర్శులను, సంయుక్త కార్యదర్శులను శనివారం నియమించింది. దీనిలో భాగంగా జార్ఖండ్ రాష్ట్రంలో పార్టీ వ్యవహారాల బాధ్యుడిగా కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్కని నియమించారు.

ప్రజా ప్రయోజన పనులు గుర్తించండి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి పనులు గుర్తించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో చేపట్టిన పనులపై పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులు, ప్రస్తుత పరిస్థితిపై శనివారం సమీక్షించారు. గిరిశిఖర గ్రామాలకు, మారుమూల గ్రామాలకు రోడ్లు అనుసంధానత కలిగే విధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగు పనులను పూర్తి చేసేందుకు రానున్న 15 రోజులకు సంబంధించి ప్రణాళిక అందజేయాలని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీకూడదని, చేసిన నిర్మాణ పనులు పటిష్టంగా ఉండాలన్నారు. నిర్మాణ పనులను రెండు, మూడు స్థాయిలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. 80 శాతానికి పైగా పూర్తయిన పనులను మొదటగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. గిరిజన గ్రామాలలో అంతర్గత రహదార్లు, కాలువలు, రక్షిత గోడలు నిర్మాణ పనులను గుర్తించాలని తెలిపారు. ఇంజనీర్లు వారి పరిధిలోని ప్రతి గ్రామాన్ని సందర్శించాలని, ప్రతి గ్రామంలో చేపట్టవలసిన పనులు గుర్తించి ముందుగానే అంచనా వ్యయాలు సిద్ధం చేసుకోవాలన్నారు. మంజూరైన పనులకు సంబంధించి పనులు చేపట్టని కాంట్రాక్టర్లను తొలగించి కొత్తవారికి పనులు కేటాయించి పూర్తి చేయాలని తెలిపారు. వందరోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఆమోదించిన 10 కి.మీ. సీసీ రోడ్లు, 10 కి.మీ సీసీ కాలువలు నిర్మాణ పనులు పూర్తి చేయాలని తెలిపారు. మంచినీటి సరఫరా పనులే కాకుండా బోర్లలో నీరు తగ్గిపోకుండా నీటి మట్టం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులు సంబంధించిన వివరాలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు తెలియజేస్తూ ఈ సంవత్సరానికి కోటి నలభై లక్షల పనిదినాలు, రూ.241కోట్ల పనులు కేటాయించడం జరిగిందని తెలిపారు. రూ.142 కోట్ల విలువ చేసే 462 పనులకు శాఖాపరమైన ఆమోదం లభించిందని, రూ.70 కోట్ల పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని, రూ.6.09 కోట్ల బిల్లులు చెల్లించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, పీఆర్ ఈఈ డా.ఎంవీఆర్ కృష్ణాజీ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, ఐటీడీఏ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

యువకుడి మృతిపై అనుమానాలు

- పోలీస్‌స్టేషన్ వద్ద తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన



పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి తల్లిదండ్రులు, బంధువులు

కొత్తవలస : మండలంలోని కొత్తూరుగొప్ప గ్రామ సమీపంలో ఆగస్టు 25న అదే గ్రామానికి చెందిన డి.రాధాకృష్ణ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. కాగా రాధాకృష్ణ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ ఆయన తల్లిదండ్రులు అప్పలరాజు, అరుణతో పాటు బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం ఆందోళనకు దిగారు. రాధాకృష్ణ మృతిపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని నినాదాలు చేశారు. ఆగస్టు 9న ఇంటి నుంచి వెళ్లిన రాధాకృష్ణ 10వ తేదీన తమ్ముడు పుట్టిన రోజు సందర్భంగా ఫోన్‌లో శుభాకాంక్షలు తెలిపాడని తరువాత ఆచూకీ లేకుండా పోయిందని సీఐకి వివరించారు. ఆగస్టు 25న గ్రామానికి సమీపంలో గల మామిడి తోటలో చెట్టుకు శవమై వేలాడుతూ కనిపించాడని విలపించారు. తమకున్న అనుమానాలను సీఐ షణ్ముఖరావుకు వివరించారు. దీనిపై స్పందించిన సీఐ మాట్లాడుతూ మృతుడి సెల్‌ఫోన్ కాల్‌లిస్టును పరిశీలిస్తున్నామని, పోస్టుమార్టం రిపోర్టు రావాల్సి ఉందన్నారు. మృతిపై అన్ని కోణాల్లో సమగ్రంగా దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల సత్తా



బంగారు, వెండి పతకాలతో విద్యార్థి రమాదేవి, కోచ్ అర్జున్

నెల్లిమర్ల రూరల్: అనకాపల్లిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్ల మండలం టెక్కలి సెంచూరియన్ వర్సిటీ విద్యార్థులు సత్తా చాటారు. సబ్ జూనియర్ విభాగంలో రమాదేవి బంగారు పతకం, జూనియర్ విభాగంలో వెండి పతకాన్ని సాధించింది. సీనియర్ విభాగంలో శ్రీలక్ష్మి బంగారు పతకం కైవసం చేసుకొంది. మరో విద్యార్థి శ్రీపాద శ్రీజ తెలంగాణలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, వెండి పతకాలను సాధించింది. పతకాలు సాధించిన విద్యార్థులకు వర్సిటీ వీసీ పీకే మహంతి, సిబ్బంది అభినందలు తెలిపారు.

ఎయిర్‌పోర్టుకు మౌలిక వసతుల కల్పన



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మౌలిక వసతుల కల్పన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. విమానాశ్రయానికి వసతుల కల్పన, భూ సేకరణ తదితర అంశాలపై తన చాంబర్‌లో కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఎయిర్‌పోర్టుకు నీటిని అందించేందుకు సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన పనులపై ఆరా తీశారు. వీలైనంత వేగంగా పూర్తి చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుమారు 25 కిలోమీటర్ల మేర నాలుగు కెనాల్స్‌ను తవ్వాల్సి ఉందన్నారు. దీనికి అంచనాలను త్వరగా తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ

- 6వ తేదీలోపు గిరిజనుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

విజయనగరం అర్బన్: డీఎస్సీ పోటీ పరీక్ష ఉచిత శిక్షణకు గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత జిల్లా అధికారి రామానందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పించి పరీక్షకు ఉచితంగా శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. బీఈడీ/డీఈడీ అభ్యర్థులు టెట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత పరీక్షలో ప్రతిభ ఆధారంగా 100 మందిని ఎంపిక చేస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సంబంధిత విద్యార్హత, కుల ధ్రువీకరణపత్రాలు, రేషన్ కార్డు జెరాక్స్‌లు, రెండు పాస్‌ఫొటోలను ఈ నెల 6వ తేదీలోగా కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయానికి అందజేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్: 8374821431, 82478 52338 నంబర్లను సంప్రదించాలన్నారు.